క్లుప్తంగా

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

రాయికల్‌: నిరుపేదల సంక్షేమమే బీఆర్‌ఎస్‌ పార్టీ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ అన్నారు. ఈ మేరకు గురువారం రాయికల్‌ మండలం అల్లీపూర్‌ గ్రామంలోని 6, 7, 8, 9వ వార్డు సభ్యులు బోగ వనిత, సిరిపురం వనిత, పోతు ప్రవళిక, ఓరుగంటి రాజక్క, పద్మశాలి, మున్నూరుకాపు సంఘం నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్‌ రాజలింగం, ఎంపీటీసీ మోర విజయ, కోఆప్షన్‌ సభ్యుడు ముకీద్‌, గ్రామ అధ్యక్షుడు రత్నాకర్‌, ఉపసర్పంచ్‌ సాగర్‌రావు, మండల ఉపాధ్యక్షుడు మహేశ్‌, అధికార ప్రతినిధి హరీశ్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా

జగిత్యాల: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ అన్నారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయంలో ఎస్టీయూకు సంబంధించిన నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బైరం హరికిరణ్‌, మచ్చ శంకర్‌ పాల్గొన్నారు.

రైతులు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి

కొడిమ్యాల: రైతులు తప్పనిసరిగా విద్యుత్‌ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని జగిత్యాల డీఈఈ రాజిరెడ్డి సూచించారు. ఈ మేరకు కొడిమ్యాల మండలంలోని తిర్మలాపూర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని తిర్మలాపూర్‌, సంద్రాలపల్లి, పోతారం గ్రామాల్లో విద్యుత్‌ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ సూరంపేట ఫీడర్‌పై అధిక లోడుతో లోవోల్టేజీ సమస్య ఏర్పడుతోందన్నారు. వ్యవసాయ వినియోగదారులు తప్పనిసరిగా కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మల్యాల ఏడీఈ బాలలింగం, ఏఈలు రఘునాథ్‌, శ్రీనాథ్‌, మల్లేశ్వర్‌, శ్రీనివాస్‌, సిబ్బంది పాల్గొన్నారు.


ఏకాగ్రతతో చదవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అర్చన

రాయికల్‌: ఏకాగ్రతతో చదువుకున్నప్పుడు అనుకున్న లక్ష్యం సాధించవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణురాలు అర్చన అన్నారు. గురువారం రాయికల్‌ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఏకగ్రతతో చదువుకున్నప్పుడు అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చన్నారు. పాఠశాల కరస్పాండెంట్‌ బాలె జయశ్రీ శేఖర్‌, డైరెక్టర్‌ నిఖిల్‌ పాల్గొన్నారు.

విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్‌ పంపిణీ



ప్యాడ్స్‌ పంపిణీ చేస్తున్న క్లబ్‌ సభ్యులు

మల్యాల: మండల కేంద్రంలోని బాలికల పాఠశాల విద్యార్థులకు గురువారం నిజామాబాద్‌ లయన్స్‌ క్లబ్‌ వారు శానిటరీ ప్యాడ్స్‌, ఇంటిమేట్‌ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్‌ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ కోఆర్డినేటర్‌ ద్వారకాదాస్‌ అగర్వాల్‌, కార్యదర్శి ధర్మేంద్ర పటేల్‌, జాయింట్‌ సెక్రటరీ మేహుల్‌, డైరెక్టర్‌ భూపేంద్ర, సభ్యులు లావణ్య, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, సర్పంచ్‌ మిట్టపల్లి సుదర్శన్‌ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

మేడిపల్లి: మండల కేంద్రం శివారులో గురువారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. కోరుట్ల మండలం నాగులపేట్‌ నుంచి మేడిపెల్లి మండల కేంద్రానికి ఇసుకను అక్రమంగా తలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

శివారు గ్రామాల్లో చెత్త డంపింగ్‌

- దుర్వాసనతో గ్రామస్తుల ఇబ్బందులు
- రాత్రివేళల్లో చెత్త వేస్తున్న చికెన్‌, మటన్‌ సెంటర్ల నిర్వాహకులు
- అధికారులు జరిమానా విధించినా.. మార్పురాని వైనం



తిప్పన్నపేట శివారులో మున్సిపల్‌ సిబ్బంది పోసిన చెత్త

జగిత్యాలరూరల్‌: జగిత్యాల మున్సిపల్‌ శివారులోని గ్రామాల్లో కొంత మంది మున్సిపల్‌ కార్మికులతో పాటు పట్టణానికి చెందిన కొంతమంది అర్ధరాత్రి వేళల్లో పట్టణ శివారులోని గ్రామాల్లో రోడ్ల వెంట చెత్త పోస్తుండటంతో గ్రామస్తులతో పాటు రహదారి వెంట వెళ్లే వారు తీవ్ర దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. అలాగే గ్రామపంచాయతీ వారు ఆ చెత్తను తొలగించేందుకు పంచాయతీ కార్మికుల ద్వారా చెత్తను తొలగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వ్యర్థ పదార్థాలతో తీవ్ర దుర్వాసన..

మున్సిపల్‌ సమీపంలోని తిప్పన్నపేట గ్రామంలోని పెర్కపల్లి, తిమ్మాపూర్‌, ధరూర్‌, హస్నాబాద్‌, గ్రామ శివారులో పట్టణంలోని చికెన్‌ సెంటర్‌, మటన్‌ సెంటర్‌ నిర్వాహకులు వ్యర్థ పదార్థాలను తీసుకెళ్లి పట్టణ శివారులోని రహదారుల వెంట పడేస్తుండటంతో తీవ్ర దుర్వాసన రావడంతో పాటు ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున కుక్కలు గుమిగూడి చెత్తను నోటితో రహదారుల వెంట పడేస్తుండడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. తిప్పన్నపేట శివారులో, తిమ్మాపూర్‌ శివారులో గతంలో చెత్తపోస్తున్న వారిని గుర్తించి వారికి జరిమానా విధించినా మార్పు రావడం లేదు.

చెత్త పోస్తున్నారు



మా గ్రామంలో మూడు రోజుల క్రితం మున్సిపల్‌ కార్మికులు ట్రాక్టర్లలో చెత్త తీసుకొచ్చి గ్రామ శివారులో పోసి వెళ్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకుని గ్రామపంచాయతీలో పెట్టారు. రాత్రి వేళల్లో చాలామంది చెత్తను తీసుకొచ్చి గ్రామ శివారులో పోస్తున్నారు. **– రమేశ్‌, తిప్పన్నపేట**

మార్పు రావడం లేదు



మా గ్రామం పట్టణ శివారులో ఉండటంతో మున్సిపల్‌ వారితో పాటు పట్టణ శివారులోని కొంత మంది చికెన్‌ సెంటర్‌, ఇతర షాపుల వారు రాత్రి వేళల్లో గ్రామ శివారులో రోడ్ల వెంట చెత్తపోస్తున్నారు. పలుమార్లు జరిమానా విధించినా మార్పు రావడం లేదు. **– రమ్య, సర్పంచ్‌, తిమ్మాపూర్‌**

చర్యలు తీసుకుంటాం



జగిత్యాల పట్టణంలో సేకరించిన చెత్తను నూకపల్లి గ్రామ శివారులోని డంపింగ్‌యార్డుకే తరలించాలి. ఎవరైనా కార్మికులు పట్టణ శివారులోని గ్రామాల్లో పోస్తే వారిపై చర్యలు చేపడతాం.

– బోనగిరి నరేశ్‌, మున్సిపల్‌ కమిషనర్‌ జగిత్యాల

అటెన్షన్‌ ప్లీజ్‌



పొంచి ఉన్న ప్రమాదం

సారంగాపూర్‌: మండలంలోని లక్ష్మీదేవిపల్లి శివారుల్లోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కుంటలోకి గడిచిన వారం నుంచి ఎస్సారెస్పీ నీరు వచ్చి చేరడంతో కుంట నిండింది. జగిత్యాల నుంచి సారంగాపూర్‌, బీర్‌పూర్‌ మండలాలకు వచ్చే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారుల్లో రోడ్డును ఆనుకుని ఈ కుంట ఉంది. వాహనదారులు ఏ కొంచెం అజాగ్రత్తగా ఉన్న పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీన్ని గుర్తించిన ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.2.50లక్షలతో కుంట వెంట రక్షణ కోసం ఇనుప బారికేడ్‌లను ఏర్పాటు చేయడానికి రెండేళ్ల కింద టెండర్లు పూర్తి చేశారు. కానీ పనులు ప్రారంభించలేదు. కాంట్రాక్టర్‌ను తప్పించి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: రాజశేఖర్‌, ఆర్‌అండ్‌బీ, ఏఈ, సారంగాపూర్‌, బీర్‌పూర్‌
ఫోన్‌ నంబర్‌: 94408 18883

నిబంధనల ప్రకారమే డ్రా నిర్వహించాలి



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

జగిత్యాలటౌన్‌: మైనార్టీ కేటగిరీ కింద డ్రా నిర్వహించి మైనార్టీ లబ్ధిదారులను ఎంపిక జరిగిందని, ఎంపిక ప్రక్రియలో ఇళ్లు లభించని మైనార్టీలను తిరిగి జనరల్‌ కేటగిరీలో చేర్చితే ఊరుకోబోమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి అన్నారు. డబుల్‌ ఇళ్ల కేటాయింపులో జరుగుతున్న గందరగోళంపై గురువారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో రవీందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల కేటాయింపులో ప్రభుత్వ నిబంధనల ప్రకారం డ్రా పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను కోరారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల కేటాయింపులో ఎస్సీలకు 17శాతం, ఎస్టీలకు 6శాతం, మైనార్టీలకు 12శాతం పోను మిగతా మొత్తాన్ని ఓసీ, బీసీలకు కేటాయిస్తూ ప్రభుత్వం నిబంధనలు రూపొందించిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మైనార్టీ కేటగిరీలో 1200 దరఖాస్తుల్లో డ్రా పద్ధతిన 302 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా ఇళ్లు లభించని వాళ్లు గొడవకు దిగితే జనరల్‌ కేటగిరీ ఇళ్ల కేటాయింపు నిలిపివేయడమేంటని ఆయన ప్రశ్నించారు. ధర్నాకు దిగిన మైనార్టీలను బుజ్జగించి పంపిన పోలీసులు బీజేపీ నాయకులను అరెస్టు చేయడం దారుణమని మండిపడ్డారు. అధికారుల తీరును బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. జనరల్‌ కేటగిరీలోని అర్హులైన వారికి డబుల్‌ ఇళ్లు కేటాయించేదాకా పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. సమావేశంలో సీనియర్‌ నాయకులు ఏసీఎస్‌ రాజు, చీటి చంద్రశేఖర్‌రావు, లక్ష్మారెడ్డి, ఇత్తడి రాజిరెడ్డి, మొగ్రి విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి



పేపర్‌ ప్లేట్‌ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఏపీఎం

జగిత్యాలరూరల్‌: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని ఏపీఎం గంగాధర్‌ అన్నారు. ఈ మేరకు గురువారం జగిత్యాల అర్బన్‌ మండలం మోతె గ్రామంలో మహిళా సంఘం సభ్యురాలు షేర్ల విజయ నూతనంగా ఏర్పాటు చేసిన పేపర్‌ప్లేట్‌ యూనిట్‌ను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు వారు తీసుకున్న రుణాలతో యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందడం అభినందనీయమన్నారు. డీఎంజీ దేవయ్య, సీసీలు విద్యాసాగర్‌, రవీందర్‌, వీవోఏ రజిత పాల్గొన్నారు.

ఎంపీపీ గైర్హాజరుతో సభ వాయిదా



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ ఎంపీటీసీ మధు

రాయికల్‌: ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి గైర్హాజరు కావడంతో సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఈ మేరకు గురువారం రాయికల్‌ మండల పరిషత్‌ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఈ సమావేశానికి కేవలం జెడ్పీటీసీ జాదవ్‌ అశ్విని, బీజేపీ ఎంపీటీసీలు రాజనాల మధు, ఆకుల మహేశ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు హాజరయ్యారు. వేదికపై జెడ్పీటీసీ మాత్రమే హాజరయ్యారు. ఎంపీపీ గైర్హాజరు, కోరమ్‌ లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు సూపరింటెండెంట్‌ తెలిపారు. కాగా మండల సర్వసభ్య సమావేశాన్ని ఎందుకు వాయిదా వేశారని బీజేపీకి చెందిన ఎంపీటీసీలు రాజనాల మధుకుమార్‌, ఆకుల మహేశ్‌ నిరసన తెలిపారు.

శక్తికేంద్ర ఇన్‌చార్జిల సభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పాల్వాయ్‌ హరీశ్‌

జగిత్యాలరూరల్‌: జనవరి 7న రాష్ట్రంలో జరిగే శక్తి కేంద్ర బాధ్యులు, బూత్‌కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సమావేశానికి తప్పకుండా హాజరు కావాలని జగిత్యాల అసెంబ్లీ పాలక్‌ పాల్వాయ్‌ హరీశ్‌ అన్నారు. ఈ మేరకు గురువారం పెర్కపల్లి శివారులోని భాగ్యరాజ్‌ శివారులో శక్తికేంద్రాల బాధ్యులు, బూత్‌ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 7న స్థానిక బీఎల్‌ఎన్‌ గార్డెన్స్‌లో జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డాతో జరగబోయే వర్చువల్‌ సమావేశానికి జిల్లా, మండల పదాధికారులు, శక్తికేంద్రం ఇన్‌చార్జిలు, బూత్‌ అధ్యక్ష, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు, అసెంబ్లీ కన్వీనర్‌ మదన్‌మోహన్‌, నియోజకవర్గ నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు అనిల్‌, తిరుపతి, రాంరెడ్డి, కొక్కు గంగాధర్‌, జగదీశ్‌ పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు సూచనలు, సలహాలు ఇవ్వండి

సారంగాపూర్‌: బీజేపీ పటిష్టతకు నాయకులు, ముఖ్య కార్యకర్తలు సూచనలు, సలహాలు ఇవ్వాలని పార్టీ జిల్లా ఇన్‌చార్జి చంద్రశేఖర్‌ కోరారు. ఈ మేరకు గురువారం బీర్‌పూర్‌ మండల నాయకులతో నిర్వహించిన సమావేశంలో 7న జరిగే బూత్‌ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా వర్చువల్‌ సమావేశం ఉంటుందని, ఇందులో పార్టీ పటిష్టత, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ ఉంటుందని తెలిపారు. సమావేశంలో నాయకులు రాగిల్ల సత్యనారాయణ, మ్యాడ జనార్దన్‌, ఆడెపు రమేశ్‌, అప్పల జలేందర్‌, బూట్ల మార్కండేయ, రఘువీరారెడ్డి, శ్రీనివాస్‌, ప్రభాకర్‌, సత్యం, నరేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప సామూహిక పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని అయ్యప్ప గుట్టపై అయ్యప్ప దీక్షస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక పడిపూజ మహోత్సవ పూజ గురువారం వైభవంగా జరిగింది. అయ్యప్ప దీక్షాపరుల భజన సంకీర్తనలు, పేటతుల్లి ఆటలు వీరస్వామి సౌండ్‌, భజన గీతాలు ఆకట్టుకున్నాయి. మహిళలు కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వాములకు భిక్ష, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బ్రహ్మశ్రీ కట్ట సత్యనారాయణ, సీనియర్‌ గురుస్వాములు గందం పరందాములు, అల్లాడి వెంకన్న, గురుస్వాములు కచ్చు కొమురయ్య, తొట్ల లక్ష్మీరాజం, బొమ్మెన కుమార్‌, టేల స్వామి, రాజిరెడ్డి, రాజేశం, బూస రాజేందర్‌, కస్తూ రి హరికిరణ్‌, తాటిపాముల రమేశ్‌, బొమ్మెన నరేందర్‌, జెడ్పీటీసీ జలేందర్‌, టీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు బొల్లం రమేశ్‌, ఏఎంసీ చైర్మన్‌ కాంపెల్లి హన్మండ్లు, పీఏసీఎస్‌ చైర్మన్‌ వెంకటమాధవరావు పాల్గొన్నారు.

సంగెం గ్రామానికి ఆరోగ్య ఉపకేంద్రం

కోరుట్లరూరల్‌: మండలంలోని సంగెం గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం ఏర్పాటు చేయిస్తామని ఆరోగ్య మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రకటించారని రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు గురువారం కోరుట్లలో డయాలసిస్‌ సెంటర్‌, బస్తీ దవాఖాన ప్రారంభానికి వచ్చిన మంత్రికి వైస్‌ ఎంపీపీ చీటి స్వరూపారాణి, సర్పంచ్‌ చెప్యాల నర్సయ్య వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి మెట్‌పల్లి సభలో మాట్లాడుతూ సంగెం గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం మంజూరు చేస్తామని ప్రకటించారని, జిల్లా వైద్యారోగ్య అధికారితో ప్రతిపాదనలు సిద్ధం చేయించాలని ఆదేశించారని చీటి వెంకట్రావు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజేశ్‌

కోరుట్లరూరల్‌: మండలంలోని జోగిన్‌పెల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు సైదు సురేశ్‌ గురువారం బీజేపీ నుంచి భారత రాష్ట్ర సమితిలో చేరాడు. ఆయనకు బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్‌ పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచులు దుంపాల నర్సు, వనతడుపుల అంజయ్య, తోట శారద, సీనియర్‌ నాయకులు లింగారెడ్డి, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

సంఘం సేవలు వినియోగించుకోవాలి

పెగడపల్లి: మండల కేంద్రంలోని పెగడపల్లి సహకార సంఘం ద్వారా అందుతున్న సేవలను రైతులు వినియోగించుకోవాలని సంఘం చైర్మన్‌ రమణారావు, సీఈవో తడుకమడ్ల గోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడుతూ యాసంగి పంటసాగుకు అవసరమైన అన్ని రకాల ఎరువులు సహకార సంఘంలో అందుబాటులో ఉన్నాయని వారు పేర్కొన్నారు. కోరమాండల్‌, ఎంవోపీ, గ్రోమోర్‌ 20:20:013 యూరియా, డీఏపీ విక్రయిస్తున్నట్లు వారు వివరించారు. యాసంగి సాగుకు సంఘంలో ఎరువుల కొరత లేదని, నాణ్యమైన ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ప్రైవేట్‌ పాఠశాల ఎదుట ఏబీవీపీ ఆందోళన

మెట్‌పల్లి: పట్టణంలోని ఓ ప్రైవేట్‌ పాఠశాల ఎదుట గురువారం ఏబీవీపీ నాయకులు ఆందోళనకు దిగారు. పాఠశాలలో పనిచేసే డ్రైవర్‌ ఒకరు బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. అతడిని విధుల నుంచి తొలగిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ఎంపీ అర్వింద్‌ను ఆహ్వానించకపోవడం సరికాదు

మెట్‌పల్లి: ప్రభుత్వాసుపత్రి భవన శంకుస్థాపన కార్యక్రమానికి ఎంపీ అర్వింద్‌ను ఆహ్వానించకపోవడం సరికాదని బీజేపీ నాయకులు అన్నారు. ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.7.50కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని డిపో చౌరస్తాలో గురువారం పీఎం మోడీ, ఎంపీ అర్వింద్‌ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. నాయకులు శ్రీనివాస్‌, నవీన్‌, నరేశ్‌, రమేశ్‌యాదవ్‌, రాజిరెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కూలీల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

కథలాపూర్‌: ఉపాధిహామీ పథకం కూలీల హాజరును ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్‌ఎంఎంఎస్‌ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో జనార్దన్‌ ఆదేశించారు. ఈ మేరకు గురువారం కథలాపూర్‌ మండల పరిషత్‌ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కూలీల హాజరును ప్రతిరోజూ రెండుసార్లు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఆయన కథలాపూర్‌లో క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించి పరికరాలు త్వరగా బిగించాలని సిబ్బందికి సూచించారు. ఎంపీవో గంగాధర్‌, టీఏ శ్రీధర్‌, కార్యదర్శి సాయినాథ్‌, సత్తయ్య ఉన్నారు.

రేషన్‌ డీలర్ల నూతన కార్యవర్గం ఏర్పాటు

మేడిపెల్లి: భీమారం మండల కేంద్రంలో గురువారం రేషన్‌డీలర్ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాంచారి శ్రీకాంత్‌, ఉపాధ్యక్షుడిగా చెదలు గంగారాజం, కోశాధికారిగా పుర్రె దేవయ్యతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాజ రత్నాకర్‌రావు, గంగకిషన్‌, హరేరాము, సుజాత, సీతయ్య, గంగాజమున పాల్గొన్నారు.

రజక సంఘం కార్యవర్గం..

జగిత్యాలరూరల్‌: జగిత్యాలఅర్బన్‌ మండలం ధరూర్‌ గ్రామ శివారులో రజక సంఘం కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా చింతల రమేశ్‌, ఉపాధ్యక్షుడిగా ఆరవెల్లి శేఖర్‌, ప్రధాన కార్యదర్శి హరీశ్‌, కోశాధికారి సంతోష్‌, ప్రచార కార్యదర్శి మహేశ్‌ను ఎన్నుకున్నారు.

సంక్షిప్త వార్తలు

✦ నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

సారంగాపూర్‌: బీర్‌పూర్‌ మండలంలోని కొల్వాయి, మంగేళ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్‌ తెలిపారు. 33కేవీ విద్యుత్‌ లైన్లలో కొమ్మలు, పొదలు తొలగించే క్రమంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. నేడు

✦ బుగ్గారం మండలంలో..

బుగ్గారం: మండల సమీపంలోని కల్లెడ 33 కేవీ విద్యుత్‌ లైన్‌ ప్రత్యేక నిర్వహణ పనుల రీత్యా శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నేరెళ్ల సెక్షన్‌ ఏఈ బండారి అశోక్‌ తెలిపారు. సెక్షన్‌ పరిధిలోని తుమ్మెనాల, నేరెళ్ల, గోవిందుపల్లి, వెల్గొండ, చిన్నాపూర్‌, చందయ్యపల్లి, బుగ్గారం గ్రామాలకు కరెంట్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

✦ రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కథలాపూర్‌: మండలంలోని తాండ్ర్యాల శివారులో బుధవారం రాత్రి రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రమాదంలో గంభీర్‌పూర్‌ గ్రామానికి చెందిన కట్టకోల జ్ఞానేశ్వర్‌ కాలు, చేయి విరిగింది. జక్కని గణేశ్‌ తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. కాగా వీరి బైక్‌ను ఢీకొట్టిన బైక్‌ వ్యక్తి కోసం గ్రామస్తులు ఆరా తీస్తున్నారు.

✦ విద్యార్థి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌ ప్రాంతానికి చెందిన ఉప్పారపు రాజు (16) అనే పదో తరగతి చదువుతున్న బాలుడు గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాంధీనగర్‌కు చెందిన ఉప్పారపు రాజుకు ఆరునెలల క్రితం అపెండెక్స్‌ ఆపరేషన్‌ అయింది. కానీ కడుపునొప్పి తగ్గకపోవడంతో మనస్థాపానికి గురై గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి లక్ష్మీరాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్‌ పేర్కొన్నారు.

✦ ఇద్దరిపై కేసు నమోదు

సారంగాపూర్‌: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో గురువారం బైక్‌లో పెట్రోల్‌ పోసుకునే విషయంలో ఏర్పడ్డ చిన్న వివాదం చివరకు వారి తల్లితండ్రుల వరకు వెళ్లగా ఈ విషయంలో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. సారంగాపూర్‌ ఎస్సై మనోహర్‌రావు కథనం ప్రకారం లక్ష్మీదేవిపల్లికి చెందిన కంచర్ల శశికుమార్‌, సంబరి మహిపాల్‌ తమ బైకుల్లో పెట్రోల్‌ పోయించుకున్న సమయంలో ఒకరి బైక్‌ను మరొకరు క్రాస్‌ చేసుకున్నారు. ఈ విషయంలో ఇద్దరూ ఇంటి వద్దకు వెళ్లి శివకుమార్‌ తన తండ్రి శ్రీనివాస్‌కు, మహిపాల్‌ తన తండ్రి గంగాధర్‌కు ఈ విషయాన్ని చెప్పారు. శ్రీనివాస్‌, గంగాధర్‌ మధ్య వాదప్రతివాదనలు జరిగాయి. దీంతో గంగాధర్‌, అక్కడే ఉన్న ఆయన అన్న మల్లేశం కలిసి శ్రీనివాస్‌, ఆయన భార్యపై దాడి చేశారు. బాధితుడు శ్రీనివాస్‌ ఫిర్యాదు మేరకు గంగాధర్‌, మల్లేశంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సుందరీకరణ పనులు చేపట్టాలి



వినతిపత్రం సమర్పిస్తున్న సంఘం సభ్యులు

రాయికల్‌: పట్టణంలోని అంబేద్కర్‌ విగ్రహం వద్ద సుందరీకరణ పనులు చేపట్టాలని కోరుతూ గురువారం ఆలిండియా అంబేద్కర్‌ యువజన సంఘ సభ్యులు పట్టణశాఖ ఆధ్వర్యంలో మున్సిపల్‌ చైర్మన్‌ మోర హన్మండ్లును కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుర్రం రత్నాకర్‌, ఉపాధ్యక్షుడు మల్యాల శ్రీనివాస్‌, సభ్యులు సంజీవ్‌, చెంగలి గంగాధర్‌, పుర్రె శ్రీనివాస్‌, బూర్గుల రాజేందర్‌, ఆకు రాజేందర్‌, వేములస్వామి, నర్సయ్య, శ్రీనివాస్‌, నారాయణ పాల్గొన్నారు.